క్లుప్తంగా

యాచకులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : జ్ఞానాపురం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గల యాచకులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ నగరంలో రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో చలిలో యాచకులు, నిరాశ్రయులు నిస్సహాయ స్థితిలో తలదాచుకోవడం తమ సంస్థ సభ్యులు గుర్తించారన్నారు. తమ వంతుగా వారికేమైనా సహాయం చేయాలని ఆలోచించి రగ్గులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సుమారు 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీవీ చారి, మనీషా, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాఖ విద్య: యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. ఏయూ కాన్వోకేషన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఏయూలో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా విశ్వవిద్యాలయ వ్యవస్థ నిలుస్తుందన్నారు. నిపుణులైన ఆచార్యుల మార్గదర్శకాన్ని స్వీకరించాలని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మమైన ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించడం, ఇక్కడ నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో కార్యరూపంలో చూపుతూ కార్యసాధకులుగా మారాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాభారతిలో నేటి నుంచి నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. గురువారం కార్యక్రమ వివరాలను ఆయన వెల్లడించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా మూడు రోజుల పాటు నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20న ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ హాజరు కానున్నారన్నారు. వెంకట చిన్నారావు శిష్య బృందం భరతనాట్యం ప్రదర్శిస్తారని, ముఖ్య అతిథిగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య కె.సి.రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. 21న ఎ.బి.బాలకొండలరావు శిష్య బృందం శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారన్నారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీ చేశారని తెలిపారు. 22న వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు మోహిని భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శించనున్నారన్నారు. రోజూ సాయంత్రం 6.15 గంటలకు నృత్య కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

రైతు బజార్ స్టాళ్లకు డ్రా

మహారాణిపేట: రైతు బజార్లలో ఖాళీగా ఉన్న వివిధ స్టాళ్లకు గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సమక్షంలో డ్రా తీశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దరఖాస్తుదారులు, రైతుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 23 డ్వాక్రా, 7 దివ్యాంగులు (పీహెచ్‌సీ)కి కలిపి మొత్తం 30 స్టాళ్లకు డ్రా తీశారు. పీడీ డీఆర్‌డీఏ, దివ్యాంగుల విభాగం పర్యవేక్షణ అధికారి, జీవీఎంసీ యూసీడీ ఏపీడీ, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, పలు రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్ల సమక్షంలో డ్రా తీసి స్టాళ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతా అధ్వానం



జాతీయ రహదారి రెడ్డి కంచరపాలెంలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఇనుప గ్రిల్స్

- అసంపూర్తి పనులతో నిరుపయోగంగా గ్రీన్‌బెల్ట్ గ్రిల్స్
- ఇనుప గ్రిల్స్, ఓపెన్ జిమ్ సామగ్రి చోరీ
- స్పందించని ఇంజినీరింగ్ అధికారులు



గ్రీన్‌బెల్ట్‌లో అధ్వానంగా తయారైన వాకింగ్ ట్రాక్, జిమ్



వివేకానందవీధి గ్రీన్‌బెల్ట్‌లో నిలిపివేసిన రక్షణ గ్రిల్స్

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం వెళ్లే మార్గంలో గ్రీన్ బెల్ట్‌లో ఓపెన్ జిమ్‌లు, రక్షణ గేట్లు వాకింగ్ ట్రాక్‌లు నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధ్వానంగా మారాయి. జీవీఎంసీ జోన్ – 5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ నిరుపయోగంగా వదిలేయడంతో దొంగల పాలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెడ్డికంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, వివేకానందనగర్, రవీంద్ర నగర్, దేవేంద్రనగర్‌కు వెళ్లే మార్గాల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాకులు శిథిలావస్థకు చేరకున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుందరంగా నిర్మించారు. 90 శాతం పనులు పూర్తయిన సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా పనులు ప్రారంభించకపోవడంతో గ్రీన్‌బెల్ట్‌లు అధ్వానంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రిల్స్‌బెల్ట్ ప్రాంతాలను ఆనుకుని ఇనుప గ్రిల్స్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో తుప్పు పట్టి మూలకు చేరాయి. మరికొన్నింటిని దొంగలు అపహరించుకుపోతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, గ్రిల్స్‌కు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి

కంచరపాలెం జాతీయ రహదారిలో నిర్మించిన గ్రీన్‌బెల్ట్‌లో ఇనుప గ్రిల్స్ అధ్వానంగా మారాయి. పనులు నిలిపి వేయడంతో రక్షణ గ్రిల్స్‌ను అసంపూర్తిగా వదిలేశారు. గ్రీన్‌బెల్ట్‌లో పనులు ప్రారంభించి ఓపెన్ జిమ్‌లకు రక్షణ కల్పించాలి.

– ఎస్.హరినాథ్, రెడ్డికంచరపాలెం

నిర్లక్ష్యంగా వదిలేశారు

జోనల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. రక్షణ గ్రిల్స్ పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంతో అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– పి.కామరాజు, ఊర్వశి కూడలి

అధికారులు స్పందించాలి

గ్రీన్‌బెల్ట్ స్థలాలు ఆక్రమణకు గురవుతుండడం, ప్రజా ప్రతినిధులు ఫిర్యాదులతో తొలగించడం జోన్ పరిధిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. రక్షణ లేని గ్రీన్‌బెల్ట్ స్థలాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు స్పందించాలి. అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేయాలి.

– పి.శంకరరావు, కంచరపాలెం

గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త

పట్టించుకోని శానిటేషన్ అధికారులు



పాత రేసపువానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలో ఏటా వర్షాకాలం ముందు గెడ్డల సుందరీకరణ కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తుంటారు. తీరా కొద్ది రోజుల తర్వాత ఏ గెడ్డలో చూసినా చెత్త, వ్యర్థాలే ఎక్కడికక్కడ దర్శనమిస్తుంటాయి. జోన్ – 3 పరిధి 24వ వార్డు పాత రేసపువానిపాలెం జాతీయ రహదారి పక్కన గల గెడ్డలన్నీ చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇక్కడి సచివాలయం రోడ్డులో గల గెడ్డలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది జ్వరాలు సోకుతున్నాయని హడలిపోతున్నారు. పలు ప్రాంతాల నుంచి మురుగునీరు, వర్షపు నీరు ఈ గెడ్డలోకి వస్తుంది. కానీ నెలల తరబడి గెడ్డలు శుభ్రం చేయకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే సచివాలయం ఉన్నా శానిటేషన్ కార్యదర్శి కూడా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అలాగే వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలోనే ఉన్నా సూపర్‌వైజర్ కూడా గెడ్డల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. కోడి మాంసం వ్యాపారులు కూడా కోళ్ల వ్యర్థాలను ఇష్టారాజ్యంగా గెడ్డలోనే పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొంతమంది స్థానిక నివాసులు కూడా ఇళ్లలోని చెత్తను గెడ్డలోనే వేయడం గమనార్హం. రేసపువానిపాలెం నుంచి ఈ గెడ్డ ద్వారా కేఆర్ఎం కాలనీ మీదుగా వేళ్లే మురుగునీరు చెత్త, వ్యర్థాలు కారణంగా ఎక్కడికక్కడ ఆగిపోతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి వార్డులోని గెడ్డలను శుభ్రం చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సు నేడు

సీతంపేట : అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో షెడ్యూల్ ప్రకారం శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. జీవీఎంసీ 14, 25, 26, 42, 43 వార్డులకు సంబంధించిన ప్రజలు సదస్సులో పాల్గొనాలని, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొంటారని తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు రెవెన్యూ సంబంధిత సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్‌గా కృష్ణమూర్తి

సీతమ్మధార : నగరంలోని రైతుబజారులో విధులు నిర్వహిస్తున్న ఎస్టేట్ ఆఫీసర్లను గురువారం సాయంత్రం బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సీతమ్మధార రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్‌గా సీహెచ్.కృష్ణమూర్తిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కొండబాబును నర్సింహనగర్‌కు బదిలీ చేశారు. కంచరపాలెంలో విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని సీతమ్మధార బజారుకు బదిలీ చేశారు.

క్రిస్మస్ శోభ







నగరంలో జోరుగా సామగ్రి విక్రయాలు



వారం రోజుల్లో క్రిస్మస్ జరుపుకునేందుకు ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. అలాగే క్రిస్మస్ రోజున వినియోగించే సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. గురుద్వారా, సీతమ్మధార, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, ఎంఎంటీసీ కాలనీ, గాంధీనగర్, సత్యం జంక్షన్ తదితర ప్రాంతాల్లో స్టాళ్లు ఏర్పాటు చేసి సామగ్రి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా క్రిస్మస్ స్టార్లను విక్రయిస్తున్నారు. పలు రకాల రంగుల్లో ఈ స్టార్లు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే క్రిస్మస్ ట్రీని అలంకరించే సామగ్రి విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌ల మీద, దుకాణాల వద్ద ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. క్రైస్తవులు కుటుంబ సమేతంగా వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. శాంతాక్లాజ్ వేషధారులు ధరించే వస్త్రాలు, అలంకరణ సామగ్రి కూడా ఈ స్టాళ్లలో విక్రయిస్తున్నారు. క్రిస్మస్ స్టార్లు రూ.70 నుంచి వివిధ ధరల్లో విక్రయిస్తున్నారు. అలాగే క్రిస్మస్ ట్రీ ధర రూ.250గా వుంది. పలు రకాల రంగులలో క్రిస్మస్ తోరణాలు కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సీతమ్మధార





విశ్రాంత ఉద్యోగిపై కక్ష సాధింపు తగదు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు

సీతంపేట : ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి ఎం.రాజకిషోర్‌పై కులపరమైన వేధింపులు తగవని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుడైన రాజకిషోర్‌ను ఎస్‌బీఐ యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేసిందని, పదవీ విరమణ చేసినప్పటికీ కక్ష సాధింపు చర్యలు ఆగలేదన్నారు. ఆయనకు ఇప్పటికీ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. బాధితుడు రాజకిషోర్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఒక వివాదంలో అవతలి వ్యక్తిదే తప్పు అని కోర్టు నిర్ధారించిందని తెలిపారు. తనను యాజమాన్యం నిరాధారమైన ఆరోపణలతో చాలా కాలంగా మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. తనకు బకాయిలు చెల్లించకుండా నిలిపివేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ రాజకిషోర్‌కు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో భూపతి, కోన ప్రకాష్ పాల్గొన్నారు.

వర్షాలతో రైతుబజార్ ఖాళీ



వర్షంతో ఖాళీగా ఉన్న రైతుబజార్

సీతమ్మధార : నగరంలో బుధవారం సాయంత్రం నుంచి మళ్లీ వర్షాలు కురుస్తూ వాతావరణం మారిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సీతమ్మధార, గురుద్వారా, బాలయ్య శాస్త్రి లే అవుట్, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గాంధీనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. వర్షం కురుస్తుండడంతో సీతమ్మధార రైతుబజార్ సాయంత్రం బోసిపోయింది. వినియోగదారులు లేక రైతులు, వ్యాపారులు దిగాలుగా ఎదురుచూడడం కనిపించింది. అలాగే చిరు వ్యాపారులు కూడా బేరాలు లేక ఉసూరుమని ఇంటిముఖం పట్టారు. ఫుట్‌పాత్‌ల మీద వ్యాపారాలు చేసేవారు అకస్మాత్తుగా వర్షాలు పడడంతో ఇబ్బందులు పడ్డారు. తోపుడుబండి వర్తకులు కూడా వర్షంతో అర్ధాంతరంగా ఇంటికి పయనమయ్యారు.

మత్తు పదార్థాల జోలికి పోవొద్దు



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో గురువారం డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల ఆరోగ్యం, జీవితం, భవిష్యత్తు నాశనమవుతాయన్నారు. యువత మంచి ఆరోగ్య జీవనాన్ని అలవర్చుకుని ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలని ఆకాంక్షించారు. విలువైన మానవ వనరులుగా యువతరం నిలుస్తూ దేశ అభ్యున్నతిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డ్రగ్ ప్రివెన్షన్ కమిటీ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా రేపు



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జవహర్ నాలెడ్జ్ సెంటర్, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. టాటా గ్రూప్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో ఫార్మా, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు తీసుకుని శనివారం ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ సేవలో తరిస్తూ.. అదానీకి లాభాలు చేకూర్చేలా ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తోందని సీపీఎం సీనియర్ నాయకుడు వై.రాజు ఆరోపించారు. సీపీఎం జగదాంబ జోన్ నేత నరసింహరావు ఆధ్వర్యంలో గురువారం రామ్‌నగర్ బజార్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాత కరెంట్ బిల్లును దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో పెంచిన విద్యుత్ చార్జీలు అదానీ లాభాలకు సరిపోలేదని, ఇప్పుడు చార్జీలు పెంచి బిల్లులో కలిపి వేయడం ప్రజా వ్యతిరేకమన్నారు. కొత్తగా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరింత అదనపు భారాలు వేయడం అన్యాయమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు దుర్గారావు, చిట్టిబాబు కార్మిక సంఘం నాయకులు కె.మౌళి, కె.సంతోష్‌కుమార్, సీఐటీయూ జగదాంబ జోన్ నాయకుడు చంద్రమౌళి, అధిక సంఖ్యలో రామ్‌నగర్ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపద

విశాఖ విద్య: పూర్వ విద్యార్థులు యూనివర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి.సాంబశివరావును ఆయన సత్కరించారు. కామర్స్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థిగా రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగాఎదిగిన సాంబశివరావు సాధించిన ప్రగతి నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, కామర్స్ మేనేజ్‌మెంట్ ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు కార్యదర్శి సంజయ్ రాయ్‌ను వినతిపత్రాల్లో కోరామని పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ రిలే దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. వేతన బకాయిలు చెల్లించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధిస్తూ కొంతకాలంగా యాజమాన్యం విధిస్తున్న ఆంక్షలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కర్మాగారానికి ప్రభుత్వం మూడేళ్లపాటు టాక్స్ హాలీడే ప్రకటించాలని, స్టీల్‌ప్లాంట్ భూములను ఆర్ఐఎన్ పేరున బదిలీ చేయాలని, యాజమాన్యం, కేంద్రం విధించిన ఆంక్షల వల్ల ఉక్కు కర్మాగారానికి జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణరావు, కామేశ్వరరావు, డేవిడ్, కారు రమణ, మసేనురావు, రామకృష్ణ, సుబ్బయ్య, దేముడు పాల్గొన్నారు.